AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
29-8-2026 (Saturday) MAIN EDITION

## మెట్రో సేవలకు అంతరాయం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ మెట్రో సేవలకు మరోసారి అంతరాయం కలిగింది. మెట్రో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్కానర్లు పని చేయకపోవడంతో ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల దగ్గర ప్రయాణికులు బారులు తీరారు. ఆఫీస్ సమయంలో మెట్రో సేవలకు అంతరాయం కలగడంతో అసహనం వ్యక్తం చేశారు.

## వారికి అండగా నిలవాలి : ఖర్గే



**అక్షరటుడే, ఢిల్లీ :** నేపాల్‌లో సంభవించిన విలయతాండవంపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితులపై సత్వరమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. భారత ప్రభుత్వం వెంటనే నేపాల్‌తో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

## ఏపీ సర్కార్ కీలక ఆదేశాలు



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లో పీజీ వైద్య విద్యార్థుల విధులు, సెలవులకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ కఠిన మార్గదర్శకాలు జారీ చేసింది. పీజీ వైద్యులతో వరుసగా 24 గంటలకు మించి డ్యూటీ చేయించకూడదని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టం చేశారు.

## నేపాల్‌లో 600 దాటిన మృతుల సంఖ్య



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ విపత్తులో మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ గల్లంతైంది. దీంతో సహాయక చర్యలతో పాటు మృతదేహాల భద్రత అధికారులకు అత్యంత క్లిష్టమైన సవాలుగా మారింది.

## హెచ్-1బీ వీసాదారులకు భారీ షాక్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయే హెచ్-1బీ వీసా ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించే ప్రతిపాదనపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రతిపాదనకు కీలక ఆమోదం లభించింది. త్వరలోనే దీనిని అధికారికంగా బహిరంగపరచే అవకాశం ఉంది.

**శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంలో మార్పు కనిపించాలన్నారు. శనివారం ఆయన మీడియా చిట్ చాట్‌లో మాట్లాడారు. కొండా సురేఖ అంశంలో చర్యలు తీసుకుంటేనే బెటర్ అని అభిప్రాయపడ్డారు.. ఆ కుటుంబంపై చర్యలు తీసుకోవడానికి రెండు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆమెపై వేటు వేయడం, మంత్రి శాఖలను పునర్వ్యవస్థీకరణ చేపట్టవచ్చని సూచించారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# సురేఖపై చర్యలు తీసుకోవాలి

**▪ మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ చేపట్టాలి ▪ సీఎంపై క్యాడర్‌లో అసంతృప్తి ▪ మండలి ఛైర్మన్ కీలక వ్యాఖ్యలు**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావొస్తుందని, మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ చేపట్టాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. లంబాడా, యాదవ్, మున్నూరుకాపులకు మంత్రి పదవుల్లో అవకాశం ఇవ్వాలని సూచించారు. అప్పుడే అసంతృప్తి నేతలకు చెక్ పెట్టినట్టు ఉంటుందన్నారు. కొండా సురేఖ అంశం కాంగ్రెస్‌లో రాజకీయ వేడికి దారి తీసింది. ఆమెపై చర్యలు తీసుకోవాలని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల ఆమె సీఎంను కలిసి రాఖీ కట్టారు. దీంతో చర్యలు ఉంటాయా.. లేదా అనే సస్పెన్స్ నెలకొంది. ఈ క్రమంలో మండలి ఛైర్మన్ సైతం ఆమెపై చర్యలు తీసుకుంటేనే బెటర్ అని అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం.

### చేయాల్సింది చాలా ఉంది

ప్రజలకు చేయాల్సింది ఇంకా చాలా ఉందని మండలి ఛైర్మన్ అభిప్రాయ పడ్డారు. ఉచిత పథకాలు అసలైన లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. పెన్షన్ పెంచాలని, ఉద్యమకారులకు న్యాయం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ తగాదాలు తగ్గించాలన్నారు. చిన్నారెడ్డికి మంచి అవకాశం ఇచ్చిందని అలా మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేక విండోలు ఉంటాయని, ఎవరు ఎక్కడుంటారో తెలియదన్నారు.

### సీఎంపై అసంతృప్తి

సీఎం రేవంత్‌రెడ్డిపై క్యాడర్ అసంతృప్తి ఉందని సుఖేందర్ రెడ్డి అన్నారు. సాధారణ ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు. ఆయనను పని చేసుకోనివ్వాలన్నారు. 22ఏ ను రద్దు చేయాలని సూచించారు. గతంలో కేసీఆర్ తీసుకొచ్చిన పథకాలను కొనసాగిస్తునే సీఎం కొత్త పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు.

## ఉజ్బెకిస్తాన్ పర్యటనకు వెళ్లిన మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌కు శనివారం ఉదయం బయలుదేరారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆ దేశ అధ్యక్షుడు మీర్జియోయెవ్‌తో ప్రధాని చర్చలు జరుపుతారు. ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్‌లో నాలుగు రోజుల పాటు పర్యటిస్తారు. తాష్కెంట్‌లోని శాస్త్రి మెమోరియల్‌ను, తాష్కెంట్ స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని ఆయన సందర్శిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య రంగాలలో భాగస్వామ్యంపై చర్చిస్తారు.

## వెనెజువెలాతో అమెరికా ఆయిల్ డీల్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** వెనెజువెలాతో అమెరికా చరిత్రాత్మక ఆయిల్ ఒప్పందం చేసుకుంది. ఆ దేశంలోని చమురు రంగంలో భారీ పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 65 బిలియన్ బ్యారెళ్లపై అగ్రరాజ్యం నియంత్రణ సాధించనుంది. ఇది ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద ఆయిల్ డీల్‌గా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. తమ ప్రభుత్వం వెనిజులాతో ఒక భారీ ఒప్పందం కుదుర్చుకుందని ట్రంప్ పేర్కొన్నారు. ఇది కార్యరూపం దాల్చితే ఆ దేశంలోని వెలికితీయని భారీ చమురు నిల్వలను అమెరికాకు రుసుముతో పొందే వీలు కల్పిస్తుందని అన్నారు. ఈ ఒప్పందంలో 17 చమురు క్షేత్రాల అభివృద్ధి ఇమిడి ఉందని వెనిజుల తెలిపింది.



## వేప చెట్టు కోసం గొడవ.. ఇద్దరి మృతి


**అక్షరటుడే, సూర్యాపేట :** వేపచెట్టు విషయంలో తలెత్తిన వివాదం పెద్ద గొడవకు దారి తీసింది. ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకోవంతో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో చోటు చేసుకుంది. మంద వెంకటేశ్వర్లు చెట్టును నరికించాడు. దీంతో భుక్యా రాము అతడిపై గొడ్డలితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అంతేగాకుండా అడ్డుకోబోయిన తన తండ్రి సైదాను సైతం రాము హత్య చేశారు. అరెస్ట్ చేయడానికి వచ్చిన పోలీసులపై దాడి చేశాడు. దీంతో ఎస్సై నవీన్‌పై తలకు గాయం కాగా.. సిబ్బంది ఆస్పత్రికి తరలించారు.

## గంజాయి చాక్లెట్ల పట్టివేత

**అక్షరటుడే, మేడ్చల్ :** పిల్లలు, యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు శామీర్‌పేటలోని ఓ పాన్ షాప్‌పై దాడి చేశారు. ఈ దాడిలో 5 వేల గంజాయి చాక్లెట్లు లభించాయి. పాన్ షాప్ ద్వారా ఈ చాక్లెట్లను విక్రయిస్తున్నట్లు, పిల్లలు, యువతను ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ గంజాయి చాక్లెట్ల విక్రయం మరియు సరఫరాలో ప్రమేయం ఉన్నవారిని గుర్తించడానికి, అలాగే ఈ నిషేధిత సరుకు ఎక్కడి నుండి వస్తుందో తెలుసుకోవడానికి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## ఎమ్మెల్సీని బహిష్కరించిన ఎంఐఎం



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అత్తాపూర్‌లో బాలికపై అనుచితంగా ప్రవర్తిస్తుండగా పలువురు యువకులు ఆయనను పట్టుకొని కొట్టారు. ఈ మేరకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఎమ్మెల్సీ పదవికి వెంటనే రాజీనామా చేస్తూ శాసనమండలి ఛైర్మన్‌కు లేఖ సమర్పించాలని ఆదేశించారు



## వరదలు తట్టుకొని నిలబడిన భవనం


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఆకస్మిక వరదలు ముంచెత్తడంతో ఆ దేశం అతలాకుతలం అయింది. అనేక భవనాలు కొట్టుకుపోయాయి. అయితే ఓ భవనం మాత్రం వరదలను తట్టుకొని నిలబడింది. వరదలు ముంచెత్తడంతో ఆ భవనంలోని కుటుంబ సభ్యులు రెండో అంతస్తులోకి చేరారు. వరద నీరు చుట్టుముట్టింది. పక్కన ఉన్న భవనాలు కూలిపోయాయి. అయినా ఆ భవనం వరదను తట్టుకొని నిలబడటంతో కుటుంబ సభ్యులు ప్రాణాలతో బయటపడ్డారు.

## అర్ధరాత్రి నడవనున్న సిటీ బస్సులు

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్‌లో రాత్రి సమయాల్లోనూ బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. సెప్టెంబర్ 1 నుంచి రాత్రంతా బస్సులు తిరగనున్నాయి. రాత్రి 10 గంటల నుంచి ఉ. 5 గంటల వరకు ప్రత్యేక బస్సులను తిప్పనున్నారు. దీంతో రాత్రి వేళ ఉద్యోగాలు చేసే వారికి ఎంతో తిప్పలు తప్పనున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద ప్రస్తుతం సికింద్రాబాద్‌కొండాపూర్, బాచుపల్లివేవ్‌రాక్, సికింద్రాబాద్‌హయత్‌నగర్, కోఠిపటాన్‌చెరు, కోఠిహైటెక్‌సిటీ, సికింద్రాబాద్‌పటాన్‌చెరు మార్గాల్లో బస్సులు నడపనున్నారు.



## సైఫ్ అలీ ఖాన్ దాడి కేసు.. క్షమాభిక్ష కోరిన నిందితుడు



**అక్షరటుడే, సినిమాడెస్క్:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ నివాసంలో జరిగిన దాడి కేసు ఊహించని మలుపు తిరిగింది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడైన బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ షరీఫుల్ ఇస్లాం తాను చేసిన నేరాన్ని అంగీకరిస్తూ ముంబై సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. 2025 జనవరి 16న ముంబైలోని బాంద్రాలో తన నివాసంలో సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆగస్టు 28న జరిగిన విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరిస్తూ, శిక్షా కాలంలో కొంత క్షమాభిక్ష ప్రసాదించాలని కోర్టును కోరాడు.